B2-62
63

# పిల్లల కోసం చల్లని లోకం...



సంపద ఎందరికో ఉంటుంది... దాన్ని సత్కార్యాలకు వినియోగించే చల్లని మనసు మాత్రం కొందరికే ఉంటుంది. అలాంటి వారి సరసన చేరారు రోహిణి నిలేకని. ఇన్ఫోసిస్ సిఈవో నందన్ నిలేకని భార్యగా కాక సొంత వ్యక్తిత్వంతో గుర్తింపు పొందుతున్న రోహిణి తాజాగా సంపన్నురాలైన మానవతావాదిగా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. పిల్లలందరికీ విద్య, సురక్షిత మంచినీరు అందించేందుకు అక్షర, అర్ఘ్య... అనే రెండు పథకాల ద్వారా ఆమె చేస్తున్న కృషి ఆదర్శనీయం... అభినందనీయం.

న్ఫోసిస్ సంస్థ షేర్ల విలువ అమాంతం పెరగడంతో అందులో రోహిణికున్న వాటా విలువ కూడా పెరిగింది. దాంతో ఉన్నట్టుండి కోట్ల రూపాయల ఆస్తి ఆమె సొంతమైంది. అది చూసి 'అమ్మో... ఎంత డబ్బో..' అని రోహిణే ఆశ్చర్యపోయారు. అలాగని ఆమె తత్తర పడలేదు. పాత్రికేయురాలు, రచయిత్రి అయిన రోహిణి నిలేకని 'అర్ఘ్యం' అనే పేరుతో ఒక ట్రస్టు నెలకొల్పి సత్కార్యాలకు శ్రీకారం చుట్టారు. ఎంతో కొంత డబ్బు ఆ సంస్థలకిచ్చేసి వితరణ కార్యక్రమాల్లా ఆమె వాటిని భావించడం లేదు. తన మానాన తాను ఒక కంపెనీ సిఈవో భార్యగా పార్టీలు, వేడుకలతో కాలం గడపడం లేదు. ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలా పూర్తిగా ఆయా సంస్థల కార్యక్రమాల నిర్వహణలో నిమగ్నమవుతున్నారు. అంకితమై పనిచేస్తున్నారు.

## ఒకనాటి పాత్రికేయురాలు

బెంగుళూరులోని కోరమంగళ ప్రాంతంలో ఓ ముచ్చటైన ఇంటి పేరు అర్ఘ్యం. అంటే సమర్పించుకోవడమని అర్థం. ఆ ఇంటి ఇలలైన రోహిణి తాను ప్రారంభించిన ట్రస్టుకీ అదే పేరు పెట్టారు. తన వ్యక్తిగత ఆదాయంలో చాలా పెద్ద మొత్తాన్నే ఆమె ఈ ట్రస్టుకి బదలాయించనున్నట్లు వార్తలు. విద్య, ఆరోగ్యం, ఇ- గవర్నెన్స్, ఉపాధి కల్పన అనే అంశాలకు ఆ డబ్బు వినియోగించాలన్నది ఆమె ఆశయం. ముంబయిలోని ఎల్ఫిన్‌స్టోన్ కాలేజీలో రోహిణి, ఐఐటిలో నందన్ చదువుకున్నారు. అంతర్ కళాశాలల క్విజ్ పోటీలు ఒకరికొకరిని పరిచయం చేశాయి. రోహిణి ఇండియా టుడే లాంటి పత్రికలకు పాత్రికేయురాలిగా పనిచేశారు. వైద్యశాస్త్రం నేపథ్యంగా 'స్టిల్‌బోర్న్' అనే ఒక థ్రిల్లర్ నవల కూడా రాశారామె. పెంగ్విన్ దీన్ని ప్రచురించింది. రెండో పుస్తకం కూడా రాసే ప్రయత్నాల్లో ఉన్నారు రోహిణి. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. జాహ్నవి, నిహార్.

## అక్షరలోనే ఆమె దర్శనం!

పార్టీలు, వేడుకలకు హాజరవడానికి పత్రికలకు ఇంటర్వ్యూలు ఇవ్వడానికి అంతగా ఇష్టపడని రోహిణి 'అక్షర ఫౌండేషన్' కార్యక్రమాల్లో లీనమై కన్పిస్తుంటారు. ఈ ఫౌండేషన్‌ను ఆరేళ్ల క్రితం ప్రారంభించారామె. బెంగుళూరులోని ప్రతి చిన్నారి పాఠశాలకెళ్లేలా చేయాలన్నది 'అక్షర' ఆశయం. కేవలం బడికెళ్లడమే కాదు... బాగా చదివేలా చూడడమూ అందులో భాగమే. ఇప్పటివరకు



www.rohininilekani.org

దాదాపు పదిలక్షల పై చిలుకు పిల్లలు అక్షర ద్వారా లబ్ధి పొందినట్లు అంచనా. ఇది ప్రభుత్వం, కార్పొరేట్ రంగం, పౌరులు... ఈ మూడు దిశల భాగస్వామ్యంతో నడుస్తోంది.

బెంగుళూరు నగరం నుంచి ఇప్పుడు పల్లెలదిశగా అక్షర కార్యక్రమాలు విస్తరించాయి. రెండు మూడేళ్ల లేత ప్రాయంలో పిల్లలకు భాష నేర్చుకునే సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని అధ్యయనాలు వెల్లడిస్తున్న నేపథ్యంలో ఆ దిశగా బాలవాడీలను ప్రోత్సహించేందుకు అక్షర కార్యక్రమంలో వాటినీ చేర్చారు రోహిణి. బాలవాడీల నిర్వహణలో ఆసక్తి ఉన్నవారికి తగిన శిక్షణ, ఇతర వనరులు సమకూర్చేందుకూ అక్షర సిద్ధంగా ఉందంటున్నారామె. రీడింగ్ సిటీ పేరుతో మరో కార్యక్రమం పిల్లల పఠన సామర్థ్యాన్ని పెంచేదిశగా పనిచేస్తోంది. 7-12 ఏళ్ల మధ్య పిల్లల్లో పఠనాసక్తిని, శక్తిని పెంపొందించడం దీని లక్ష్యం. పిల్లలే కేంద్రంగా రూపొందించిన ఈ పథకం చక్కటి ఫలితాలనిస్తోందని రోహిణి అంటున్నారు. 'పేద పిల్లలకు విద్యావకాశాలూ పేదగానే ఎందుకుండాలన్నది మా ప్రశ్న. మా రీడింగ్ సిటీ కార్యక్రమం వల్ల ఒకప్పుడు పుస్తకం అంటే భయపడి పారిపోయిన పిల్లలే ఇప్పుడు ఎప్పుడెప్పుడు మరో కొత్త పుస్తకాన్ని అందుకుందామా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు..' అని చెప్పారు రోహిణి. ముంబయికి చెందిన 'ప్రథమ్' అనే స్వచ్ఛందసంస్థ దేశవ్యాప్తంగా పిల్లలకోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అక్షర ఫౌండేషన్ అందులో ఒక భాగమై పనిచేస్తుండగా ప్రథమ్ బుక్స్ అనే విభాగాన్ని రోహిణి నిర్వహిస్తున్నారు. దీని ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా పిల్లల కోసం ప్రత్యేకంగా పుస్తకాలు ప్రచురిస్తున్నారు. రంగు రంగుల బొమ్మలతో ఆకర్షణీయంగా, నాణ్యంగా కూడా ఉండే ఈ పుస్తకాల తక్కువ ధరకే లభిస్తాయి. ఇప్పటికి ఎనిమిది భారతీయ భాషల్లో పది లక్షలకు పైగా పుస్తకాలను ప్రచురించి పిల్లలకు సరఫరా చేశారు.

### బిల్‌గేట్స్ ఆదర్శం

అర్ఘ్యం చారిటబుల్ ట్రస్టు సురక్షిత నీటిసరఫరా ఆశయంగా పనిచేస్తోంది. ఇవే కాక రోహిణి సంఘమిత్ర రూరల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో పేదలకు సూక్ష్మ రుణాలిచ్చే ఒక సంస్థకు డైరెక్టరుగా కూడా ఉన్నారు. ఈ సంస్థ తరఫున పట్టణ పేదలకు రుణాలిచ్చేందుకు కావలసిన ఆర్థిక వనరులు రోహిణి సమకూర్చారు. భర్త పేరుమీద థియేటర్ నిర్మించాలన్న రంగస్థల కళాకారిణ అరుంధతినాగ్ ఆశయం సాకారం కావడానికి సైతం రోహిణి తనవంతు సాయం అందించారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడ నిర్వహించడం విషయంలో తనకు బిల్‌గేట్స్ ఫౌండేషన్ ఆదర్శం అనే రోహిణికి పని తప్ప రెండో ధ్యాస లేదు.



www.rohininilekani.org